**డాక్టరు కండి**

ఇంటో కూర్చుని, పోస్టల్ ట్యూషన్ ద్వారా. గవర్నమెంటు రిజిస్టరు కాలేజినుంచి మీరు ఒక డిప్లమో పొందవచును. ఫ్రీ ప్రాస్పెక్టస్‌కు వ్రాయండి.

**Indian Homoeopathic College (A.W.P.) Jullundur City**

**తాంబూలములకు**

యాలక్కాయ,లవంగము యిప్పుడు అక్కరలేదు.

**రూచి**

సుగంధ ద్రవ్య సముదాయము.

పచ్చకర్పూరం, కుంకు పువ్వు చేర్చబడినది.

అన్ని కిరాణా కొట్లలో దొరుకును.

కిళ్లీకొట్లలో వాడబడుచున్నది.

¼ పౌ. రు. 3—25, పోస్టేజి అదనం.

నానాకాస్మటిక్సు, విజయవాడ—2.

స్థాపితం 1920

**రెడ్డి అండ్ కో. (రిజిష్టర్డు)**

గోపాలపురం తూ. గో. జిల్లా

కుష్టు బొల్లి మేహపాడ వగైరా చర్మసుఖ వ్యాధులకు ప్రత్యేక చికిత్స.

శాస్త్రీయ— ఆయుర్వేద ఔషధములు లభించును

→ కేటలాగు సలహా ఉచితము

బ్రాంచీలు: వాల్తేరు ఆర్. ఎస్. సికింద్రాబాద్ —3560 కింగ్సువే

**యువతులు - యువకులు**

పెండ్లి కావలసిన యువతులు యువకులు వారి వివాహ సమస్య పరిష్కరించుకొనుటకు రు. 2-75 న.పై. పంపుటద్వారా దరఖాస్తుఫారం పొందండి. దరఖాస్తుఫారం మాకు చేరగనే తగిన వివరములు ఫోటోలను పంపగలము.

**మేరేజి సెటిలర్స్**

తణుకు ప. గో. ఆంధ్ర.


# రాంబాబు డైరీ

అమాయకత్వము: పోయెను.
ప్రేమమహత్యము: తెలిసెను.

గంభీరముగా నుంటున్నాను. టైమ్ టేబుల్ ప్రకారం నడుచుకొనుచున్నాను. చాలామందిని ప్రేమించితిని. ఒక పాట నేర్చుకొంటిని. శాడీనైతిని.

ఇంతే సంగతులు.

ఇట్లు,
రాంబాబు'.

## జనవరి 3

మోటర్‌సైకిలుకీ, ఒట్టి సైకిలుకీ తేడా? మో. సై.—తొక్కి ఎక్కవలెను. ఒ. సై.—ఎక్కి తొక్కవలెను. మో. సై.—పెట్రోలు మీద నడుచును. ఒ. సై.—మానవుని జీవకణముల శక్తితో నడచును. మో. సై. నేర్చుకోవాలి తొందరగా.

అక్కరకు రాని చుట్టము గ్రక్కున వరమీని వేల్పు మోహమున నెక్కిన బారని గుర్రము వదలుము. విశ్వదాభిరామ వినురవేమ. ఎంత గొప్ప మీనింగు. అక్కరకు రాని చుట్టాన్ని గుర్రంతో పోల్చాడు కవి.

## జనవరి 10

"లవ్ యీజ్ బ్లైండ్", "వైఫ్ యీజ్ ఎ నైఫ్ టు కట్ ది లైఫ్", "ఆడది అంటే లయం లయం, ఆ నీడంటేనే భయం భయం."

ఇట్లు,
సుకవి సూక్తులు.

కెఫేలో పకోడీ రోజూకంటే చాలా బాగా చేశాడు. టీ మాత్రం పాలపిండి. ఆరోగ్యం డెవలప్‌మెంటు—శీర్షాసనము పావుగంట. బస్కీలు యాభైమూడు. దండీలు పదిహేడు.

ఛాతీ—అంగుళము పెరిగెను.
ఎత్తు— 0 ,,

## జనవరి 12

మావయ్య కూతురు వర్లక్ష్మి నన్ను బాగానే ప్రేమిస్తున్నట్లుంది. ఇంకా పరిణతి నొందాలి. ఆదర్శాభిముఖ పురోగమనించవలెను. నైట్ డ్రెస్ చారల పైజమా కుట్టించుకుని తొడుక్కుంటే నాన్నగారు చూసి 'అరేబియా సాయెబులా ఉన్నావు' అన్నారు. షేమ్ అనిపించి పనివాడికిచ్చేశాను. పోనీ బాబూరావు కిచ్చినా బావుండేది.

నాన్నగారు ఇవాళే వచ్చారు ఊరునుంచి.

బెల్లం వీశ—ముప్పావలా. పంచదార వీశ—రూపాయిన్నర. ఆంధ్రలో పన్నెండు పంచదార మిల్లులు గలవు. ఉత్తరప్రదేశ్ చెరకుకు ప్రసిద్ధి.

షరా:—మామూలే.

## జనవరి 16

ఆరోగ్యం, పర్సనాల్టీ అంతా బాగానే ఉంది కాని ఆయుర్వేదంలో 'జీవక్షర' అనే టానిక్కుంది పుచ్చుకోమని సారథి సజెష్టు చేశాడు. కొన్నాను. తియ్యగా ఉంది. చీమలు పడుతున్నాయి అప్పుడే. రష్యాలో చలి ఎక్కువ. అందుకే నెపోలియన్ సైన్యం అంతా చచ్చిపోయారు. బాబూరావు రహస్యం చెప్పాడు. మీసం పైకి మెలిపెట్టమని. రోజూ ఓ పావుగంట మెలిపెడుతున్నాను. కానీ తిరగడం లేదు. అందుకని క్లిప్పులు కొన్నాను. సారథి చూశాడా చచ్చానే ఇంకో కథ రాసి పారేస్తాడు. అందుకని రాత్రిళ్లు ఎవరూ చూడకుండా తగిలిస్తున్నాను. మంటగా ఉంది. జన్మలో ఒకసారి ఆలిండియా రేడియోలో పాట పాడాలనిపించింది. సంగీతం క్లాసుల్లో చేరాలి. ఓసారెప్పుడో నాన్నగారు సజెష్టు చేశారు భరతనాట్యం నేర్చుకోరాదా అని. షేమ్.

## జనవరి 18

ఓం. అవిఘ్నమస్తు. శ్రీ శ్రీ శ్రీ ఆమధ్య వ్యాయామం చేస్తూండగా ఓసారి బాబూరావు ఫొటో తీశాడు. ఎన్‌లార్జిమెంటు స్టూడియోనుంచి తెచ్చాను. లంగోటీ, కండలూ బాగాపడ్డాయి. రూమ్‌లో తగిలిద్దామనుకుంటూ ఉండగా సారథి వచ్చాడు. 'ఇంటాయన పిల్లలూ వాళ్లూ చూస్తే జడుసుకుంటారేమో, పిల్లలు తిరిగే కొంపలేపోంది' అన్నాడు. పొయింటే సుమా. సిగరట్లు తాగుతూంటే బలే షోగ్గా ఉంటుంది. మనిషికి డిగ్నిటీ వస్తుంది. నేను కూడా తాగితే బావుణ్ను. బాబూరావు తాగుతూంటే బలే దర్జాగా ఉంటాడు. ఎక్కడో మోటర్‌సైకిలు కూడా పట్టాడు.

రాత్రి 9—35.

## జనవరి 21

ఇవాళ బాబూరావు ఒకతన్ని పరిచయం చేశాడు. పేరు శ్యాంప్రసాద్. (షరా—ఇతన్ని శ్యాంబాబు అంటారు) మనిషి పొజా అదీ మాత్రం పెద్ద హిట్లరులా ఉన్నాడు. ఒత్తి అయోమయం మనిషి. జీవకళ లేదు. ఎప్పుడు చూసినా మైండు ప్రెజంటూ, బుర్ర ఆబ్సెంటూ. అంత విచిత్రమైన మనిషిని నే నెక్కడా చూళ్ళేదు. బాబూరావు బలేవాడే. అతనికి దొరికేవాళ్లంతా ఇదే సరుకు. రాత్రి కల వచ్చింది. వర్లక్ష్మి, నేను మోటర్‌సైకిల్ మీద పోతున్నాంట ఎలక్షన్‌కి. నేను ఖద్దరు లాల్చీ, ఉలెన్ పాంటూ, గాంధీ టోపీ పెట్టుకున్నాను. పంజాబీ డ్రెస్సు వేసుకుంది వర్లక్ష్మి. మోటరసైకిల్ వంద మైళ్లలో పోనిచ్చాము.

## జనవరి 24

డైరీని ఎంత జాగర్తగా దాచినా లాభం

ఉంటంలేదు. సారధి దాన్ని బట్టీపట్టేసి, నేను రాగానే నాముందే అన్నీ అప్ప చెప్పేస్తున్నాడు. అందుకని దర్జాగా లెక్కలేనట్లు బయటపడేస్తున్నాను డైరీని. నాకేం భయమా? బూతులు రాస్తున్నానా?

## జనవరి 27


శ్యాంబాబు పొద్దున్నే వచ్చి తన ప్రేమ కథంతా చెప్పాడు. ట్రాజడీయే. ఒట్టి అమాయకుడు—నాంత పర్సనాల్టీ ఉందన్నమాటే గాని. అతన్ని చూస్తే జాలేస్తోంది. అతని ప్రేమ ఫలించటం కోసం నా సర్వస్వం త్యాగం చెయ్యాలనుకున్నాను. అనుభవంలేనివాడు. తెల్లవారు జామున ఆరుబైట లంగోటీతో రహస్యంగా బస్కీలు తీస్తూంటేపక్కింటి అరవమ్మాయి మేడెక్కి చూసి ఫక్కున నవ్వింది. "అటువంటి పరిస్థితుల్లో నేనే అయితే నూతిలో పడి చస్తా" అన్నాడు బాబూరావు (పూర్ ఫెలో). రేపు గుడికి వెళ్ళాలి. వర్లక్ష్మి వస్తుంది. హనుమంతులవారు బుద్ధిమంతులవారు. మహా వీరుడు. నేను ఆయన తోకంతకూడా వుండను గదా! జై వీర హనుమాన్. శ్రీరామ, శ్రీ కృష్ణ, మంగళం మహత్.

## జనవరి 30

నాన్నగారి ఫ్రెండుగారు కొత్తగా పెట్టిన 'గుజ్జన గూళ్ళు' అనే పత్రికలో నా కథ 'తల్లి మాట వినవలెను' అనేది వేశారు. రచన—హిమకిరణ్ అని దర్జాగా పెద్దక్షరాల్లో వేశారు. ఆంధ్రప్రభకు కూడా ఒక నవల పంపిస్తా. ముష్టి ఇంత చిన్న పత్రికలోనే వేసుకోగా లేంది ఆంధ్రప్రభ వాళ్ళెందుకు వేసుకోరు. హిమకిరణ్ అంటే నేనేనని చెప్పా వర్లక్ష్మితో. కథ చదివి బలేగా నవ్వింది. ఆ నవ్వు శరత్కాలపు వెన్నెలవలె నుండెను. నా మనసున మల్లెలు బూచెను. ఇహనుంచి ప్రోజు రాయదలుచుకోలేదు. భాష అనేది మానవుని హృదయ సంబంధమైన ఒకానొక ఆవేదనాజనితమైన శబ్దం.

## ఫిబ్రవరి 2

నాన్నగారు నా కోసం సంబంధాలు వెతుకుతున్నారుట. మొన్న ఒక సంబంధం వచ్చిందిట. మూడువేలు కట్నంట. మోటర్‌సైకిల్ కొనుక్కోవచ్చు. అయితే ఇప్పుడు మళ్ళీ వర్లక్ష్మిని మానేసి ఇంకో అమ్మాయిని ప్రేమించాలి గాబోలురా దేముడా అని విసుగ్గా ఉంది. అమ్మమాత్రం పరాయి సంబంధానికి ఒప్పుకోదు. మావయ్య అమ్మకి సాయానా అన్నయ్యేగా అందుకు. ఇంతకీ మావయ్య మోటర్‌సైకిల్ కొనిపెడతాడో లేదో. ఇవాళ కవిత్వాన్ని గురించి దీర్ఘంగా ఆలోచించాను. కవిత్వం అనేది మానవ హృదయగతమైన నవరసముల యొక్క పరస్పర సంఘర్షణాజనితమైన భాష.



ఎక్కడికీ పయనం? ఫోటో—పి. గురుమూర్తి (మద్రాసు-18)

## ఫిబ్రవరి 5

తిలక్ హాల్లో ఆయు నెవరో పాటకచేరీ చేస్తూంటే వెళ్ళాను. అందరూ ఎంతో ఆనందించి తలకాయలు తెగవూపేశారు. నేనూ వూపేశాను. కాసేపు ఆనందించి టైము అయిపోతూందని వచ్చేశాను. ఆయన చాలా గొప్పగా పాడతాట్ట. ఇంటికొచ్చేసరికి పర్సులో 5 రూపాయల నోటు కనుపించలేదు. పర్సు ఉంది. నోటు లేదు. కాబట్టి బహుశా నోటు తీసుకుని పర్సు మళ్ళీ జేబులో పెట్టేసి ఉంటాడు దొంగ. కాళ్ళు చూసుకుంటే ఒక కాలికి ఎర్ర బూటు, ఇంకో కాలికి నల్లబూటు ఉంది. ఎవరిదో ఆ ఎర్రబూటు. పాపం ఏడ్చిఉంటాడు. పాట కచేరీలతో ఇదే గొడవ. జీవకళ అయిపోయింది. పని చెయ్యలేదు, ఇంకో బాటిల్ పుచ్చుకోమన్నాడు సారధి. అతి ఆకలి అనేది దరిద్రుడి లక్షణాలలో ఒకటి. దాన్ని జయించాలని చూస్తున్నాను.

## ఫిబ్రవరి 9

ఉమెన్సు కాలేజీ గోడ ఎక్కుతూంటే కాలు జారి పడినట్లు కలవచ్చింది. తెల్లారి లేచి చూస్తే నేలమీద పడుకొని ఉన్నాను. రాత్రి మంచంమీద పడుకొన్నవాణ్ణి, తెల్లారేసరికి నేలమీదకు ఎలా వచ్చానా అని ఆశ్చర్యపోయాను. బహుశా దొర్లి ఉంటాను. అత్తయ్య గారింటి కెళ్ళాను. వర్లక్ష్మి కాఫీ ఇచ్చింది. డికాషన్ ఎక్కువైంది. నేను హిట్లరంతవాణ్ణి కావాలని మావయ్య దీవించాడు. హార్మణి వాయించి, పాట పాడి వచ్చాను.

## ఫిబ్రవరి 19

ఇవాళ కాలేజీలో ఏదో ఫంక్షన్ జరిగింది. నేను మైకులో పాడాను. పాడుతున్నంతసేపూ జనం తప్పట్లు కొడుతూనే ఉన్నారు. పాపం సారధికి పాటంతా అయిం తర్వాత గానీ కొట్ట లేదు. ఫీలయి ఉంటాడు. నిష్కామ ప్రేమ అనేది చాలా పవిత్రమైనదిట. రిటైరయిం తర్వాత పెళ్లి చేసుకుంటే దాన్ని తేలిగ్గా సంపాయించవచ్చును. సుల్తాన్ బజార్ దగ్గర రోడ్డు గోతులు పడింది. అణాపెట్టి సెనగపప్పు కొని జేబులో పోసుకొని గబగబ వస్తూంటే దార్లో ప్రతివాడూ నన్ను చూసి నవ్వటం మొదలు పెట్టాడు. ఇంటికొచ్చిం తర్వాత చూసుకుంటే జేబులో పప్పులేదు. జేబుకు చిల్లుపడింది. మంగళం మహత్.

## ఫిబ్రవరి 22

ఆదివారం. కెఫేలో స్పెషల్ చక్రపొంగలి సుష్టుగా తిన్నాను. రోజంతా నిద్రపోయాను. స్వార్థపరుడైన మానవరాక్షసుని కరాళ కోరల క్రింద అణగారిపోయే స్త్రీలను ఉద్ధరించవలెను. మనిషికి ప్రతిరోజు ఒక ప్రతిజ్ఞ, సాధన అవసరం.

## ఫిబ్రవరి 28

జాతి కుల మత వయోవివక్షత లేకుండా ప్రేమించి పెళ్లి చేసుకోవడం మంచిదా కాదా అనే శీర్షిక క్రింద సంతకాలు సేకరించాలి. ప్రేమ పవిత్రమైనది. అది వీటన్నిటినీ అధిగమించి ఉన్నతోన్నతపథాలకు సాగిపోతుంది.

## మార్చి 1

నెహ్రూగారిని చూస్తే జాలేస్తుంది. మార్చి వచ్చేసింది. పరీక్షలు వచ్చేస్తున్నాయి. సౌందర్యారాధన తగ్గించాలి. అన్నింటికీ ఫుల్‌స్టాప్. చదువవలెను. లెఫ్ట్ రైట్ క్విక్ మార్చి. ఇంతే సంగతులు—మర్చిపోయా. నా డైరీ ఒక మహాకావ్యంట. సారధి చెప్పాడు. ★

నండూరి పార్థసారధి